క్లుప్తంగా

పంచాయతీ సిబ్బందితో పనులు



పనులు చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

జగిత్యాలరూరల్: నర్సింగాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ పంచాయతీ సిబ్బందితో చేయిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ప్రైవేటు కాంట్రాక్టర్ తన స్వలాభం కోసం పంచాయతీ సిబ్బందితో పనులు చేయిస్తున్నారని, పనులు చేయించిన వారిపై అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

పంచాయతీరాజ్ ఏఈగా జగదీశ్వర్



కథలాపూర్: మండల పంచాయతీరాజ్ ఏఈగా జగదీశ్వర్ నియమితులయ్యారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి అధికారులు, ఆయా గ్రామాల నాయకులను పరిచయం చేసుకున్నారు. ఇన్నాళ్లు కథలాపూర్‌కు ఇన్‌చార్జి ఏఈగా మల్యాల ఏఈ జ్ఞానేశ్వర్ విధులు నిర్వర్తించారు. కథలాపూర్‌కు పూర్తిస్థాయి ఏఈ రావడంతో అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయని నాయకులు పేర్కొన్నారు.

పరీక్షకు హాజరు కావాలి

ఇబ్రహీంపట్నం: వేములకుర్తి, ఎర్దండి గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేయనున్న మీసేవ కేంద్రాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 27న జగిత్యాలలో నిర్వహించే రాత పరీక్షకు హాజరు కావాలని తహసీల్దార్ ప్రసాద్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఐడీవోసీలో రిపోర్టు చేసి మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు నిర్వహించే రాత పరీక్షలో పాల్గొనాలని సూచించారు.

శివాజీ విగ్రహం ఏర్పాటు చేయాలి



కలెక్టరేట్ వద్ద బజరంగ్‌దళ్ కార్యకర్తలు

కోరుట్ల: పట్టణంలోని కల్లూర్ రోడ్ జంక్షన్ వద్ద ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు బజరంగ్‌దళ్ కార్యకర్తలు బుధవారం వినతిపత్రం సమర్పించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కమలాపూర్‌లో పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

ధర్మపురి: జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. కమలాపూర్ గ్రామంలో బుధవారం ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. వైద్య సిబ్బంది తదితరులున్నారు.

ఆలయ భూమిలో వాహనాలు పార్కింగ్ చేయొద్దు

జగిత్యాల: జగిత్యాల శివారు వాణీనగర్‌లోని రాజరాజేశ్వరస్వామి ఆలయ భూమి సర్వే నంబరు 171లో ఎగ్జిబిషన్ కోసం టెండర్ ఇచ్చారని, పట్టణానికి చెందిన వాహనదారులు మున్సిపల్ కాలువను మూసి వాహనాలను ఇష్టారాజ్యంగా పెడుతూ ఎగ్జిబిషన్‌దారులను ఇబ్బంది పెడుతున్నారని ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ నాయన సుప్రియ అన్నారు. వాహనాలు పార్కింగ్ చేయకుండా కందకాలు తీయించారు. అక్కడున్న టేలాలను తొలగించారు. ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి వరద ఆలయ భూమిలోకి వస్తోందని, అక్కడా కందకం తీయించామన్నారు. జగిత్యాల డివిజన్ పరిశీలకులు రాజమౌళి, దేవాలయ ఈవో వామన్, కాంతరెడ్డి, సిబ్బంది తేజ, రవీందర్, భార్గవ్, రజినీకాంత్, లక్ష్మీరాజం పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

జగిత్యాలరూరల్: పోరండ్ల గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ తల్లి దేవాలయంలో బుధవారం ఎల్లమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ముద్దం మల్లేషంగౌడ్, ముద్దం గంగరాజంగౌడ్, ముద్దం అశోక్‌గౌడ్, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

మెట్‌పల్లి: పట్టణంలోని పానీపూరి బండ్లను బుధవారం మున్సిపల్ సిబ్బంది తనిఖీ చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని పలువురి నుంచి రూ.5వేల జరిమానా వసూలు చేసి సూచనలు చేశారు. రత్నాకర్, విష్ణు, ముజీబ్, నిజాం తదితరులున్నారు.

క్రీడల్లో జిల్లాకు పేరు తేవాలి

- జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: క్రీడల్లో జిల్లాను అగ్రగామిగా నిలపాలని జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి కోరారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని వివేకానంద మినీ స్టేడియంలోని పైకా భవనంలో జరిగిన జిల్లాస్థాయి వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సెప్టెంబర్ 10న అండర్ 17 బాలికల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, 11న అండర్ 17 బాలుర కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, 12న అండర్ 14 బాలుర కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలస్థాయి క్రీడలను సెప్టెంబర్ 6 లోపు నిర్వహించాలన్నారు. ఎస్జీఎఫ్ కార్యదర్శి బి.లక్ష్మీరాంనాయక్, పెటా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పడాల విశ్వప్రసాద్, అశోక్, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

కేజీబీవీ సిబ్బంది వివరాలు వెబ్‌సైట్‌లో..

జగిత్యాల: సమగ్ర శిక్ష జిల్లా ఆధ్వర్యంలో నడుస్తున్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో తాత్కాలికంగా కాంట్రాక్ట్ పద్ధతిపై పని చేస్తున్న స్పెషల్ ఆఫీసర్లు, పీజీసీఆర్టీలు, సీఆర్టీలు, పీఈటీలు, అకౌంటెంట్లు, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది షిఫ్టింగ్(పరస్పర, జిల్లా, అంతర్ జిల్లా పరిధిలో) కోరేవారు తమ అభ్యర్థనలు వెబ్‌సైట్‌లో సమర్పించాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.

ఆలయంలో ఎమ్మెల్యేల పూజలు



కోరుట్ల ఆలయంలో పూజలు చేస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే

జగిత్యాల: కోరుట్ల పట్టణంలోని వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, అనూప్‌రావు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని వాణీనగర్‌కు చెందిన శ్రీనివాస్ తుంటి ఎముక సమస్యతో, 13వ వార్డుకు చెందిన మహ్మద్ ఆసీఫ్ నేత్ర సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా.. సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.2.65లక్షల ఎల్‌వోసీని అందజేశారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ సహచర అధ్యాపకులతో కలిసి ఎమ్మెల్యేను కలిశారు. కళాశాల గురించి ఎమ్మెల్యేకు వివరించారు.

ఎమ్మెల్యేను కలిసిన ట్రాన్స్‌కో ఎస్ఈ

జగిత్యాలక్రైం: జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సాలియానాయక్ బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ట్రాన్స్‌కో డీఈలు గంగారాం, రాజిరెడ్డి, రవీందర్, ఏడీ జవహర్‌నాయక్, ఏఈలు అశోక్, రహీం ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రానికి స్థలం కేటాయించాలి



ఎమ్మెల్యే సత్యంకు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

మల్యాల: ముత్యంపేట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రానికి శాశ్వత ప్రాతిపదికన స్థలం కేటాయించాలని కోరుతూ మల్యాల, ముత్యంపేట, గుడిపేట రైతులు బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వినతిపత్రం సమర్పించారు. ముత్యంపేటలోని వరద కాలువ వద్ద పదేళ్లుగా ఐకేపీ, పాక్స్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మూడు గ్రామాల రైతులు భూమి చదును చేసుకొని ధాన్యం కుప్పలు పోస్తున్న స్థలాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రానికి కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని రైతులు తెలిపారు. సంత ప్రకాశ్‌రెడ్డి, బద్దం తిరుపతిరెడ్డి, బద్దం రాంచంద్రారెడ్డి, సంత మోహన్‌రెడ్డి, సింగిరెడ్డి లచ్చిరెడ్డి, సంత ప్రతాప్‌రెడ్డి, మల్లారెడ్డి, మల్లయ్య, అంజయ్య, మహేశ్‌రెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



పోచయ్యకు నివాళి అర్పిస్తున్న కౌన్సిలర్లు

మెట్‌పల్లి: వార్డుల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, తక్షణమే వాటిని నియంత్రించాలని పలువురు కౌన్సిలర్లు కోరారు. మున్సిపల్ సమావేశ మందిరంలో బుధవారం చైర్‌పర్సన్ రాణవేని సుజాత అధ్యక్షతన పాలకవర్గ సమావేశం జరిగింది. ముందుగా ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన 14వ వార్డు కౌన్సిలర్ మర్రి పోచయ్యకు నివాళి అర్పించారు. కౌన్సిలర్లు చెట్లపల్లి మీనా, ఒజ్జెల బుచ్చిరెడ్డి కుక్కల బెడదతో ప్రజలు భయాందోళన చెందుతున్నారని తెలపగా.. చర్యలు తీసుకోవాలని అధికారులకు చైర్‌పర్సన్ సూచించారు. పలు అంశాలను ప్రవేశపెట్టగా.. కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. కమిషనర్ మోహన్, అధికారులు పాల్గొన్నారు.

తాటిపల్లి గురుకుల కళాశాలలో పారిశుధ్య పనులు



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వాతి

మల్యాల: తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలలో పారిశుధ్య పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఎంపీడీవో స్వాతి పనులు పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. శిథిలావస్థకు చేరిన గదులు తొలగించామని, విద్యార్థుల పరిసరాల్లోని పిచ్చిమొక్కలు తొలగించడంతోపాటు విద్యార్థుల తరగతి గదులకు కిటికీల మరమ్మతులు చేపట్టామన్నారు. ప్రిన్సిపాల్ పత్తెం శ్రీనివాస్ ఉన్నారు.

సుప్రీం తీర్పుపై పునరాలోచన చేయాలి



జగిత్యాలటౌన్: అంబేడ్కర్ చౌరస్తాలో వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నేతలు

జగిత్యాలటౌన్: వర్గీకరణతో మాలలకు తీరని అన్యాయం జరుగుతోందని, క్రిమిలేయర్ పేరుతో మాలలపై కుట్ర జరుగుతోందని, వర్గీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నేత నారాయణ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీ నిర్వహించి తహసీల్ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. నేతలు పాల్గొన్నారు.

ధర్మపురి: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెనక్కి తీసుకోవాలని కోరుతూ బుధవారం ఎస్సీ, ఎస్టీ పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ విజయవంతమైంది.

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండల కేంద్రంలో మాల మహానాడు ఆధ్వర్యంలో బంద్ చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. కాయిత రాజు, సన్నీ, ప్రమోద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: సామాజికంగా వెనకబడిన ఎస్సీ సామాజికవర్గాన్ని వర్గీకరించడం రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమని మాల మహానాడు మండలాధ్యక్షుడు జవ్వాజి శంకర్ అన్నారు. చెలుమల్ల రాజలింగం, ముద్దమల్ల స్వామి, శశికుమార్, అలుగునూరి చుక్కయ్య, గడ్డం రమేశ్ పాల్గొన్నారు.

రాయికల్: మూటపల్లి గ్రామంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక జేఏసీ ఆధ్వర్యంలో నినాదాలు చేశారు. బెక్కం తిరుపతి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం ఇచ్చిన తీర్పును పునర్ పరిశీలించి ఉపసంహరించుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం మండల ఉపాధ్యక్షుడు జంగం దినేశ్ అన్నారు.

పెగడపల్లి: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో మాల మహానాడు సంఘం నాయకులు పెగడపల్లిలో బంద్ పాటించారు. రాజయ్య, అరుణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: బంద్ బీర్‌పూర్ మండలంలో ప్రశాంతంగా జరిగింది. ఇందిరానగర్ సమీపంలోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

కోరుట్ల రూరల్: ఆరోగ్యశ్రీ ఆరోగ్య మిత్రలు బుధవారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. జీతాలు తదితర అంశాల్లో తమను పట్టించుకోవడం లేదని వాపోయారు. శ్రీనివాస్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణా చేస్తే చర్యలు

రాయికల్: మండలంలో ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఖయ్యూం హెచ్చరించారు.

చెక్కులు అందజేత

మేడిపల్లి: భీమారం మండలం గోవిందారం గ్రామానికి చెందిన తోట అనిల్, కుంట సత్తవ్వ, కొండ మల్లేశంకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ భీమారం మండల ఉపాధ్యక్షుడు తోకల నర్సయ్య, గ్రామ అధ్యక్షుడు నల్లపు శేఖర్ అందజేశారు. కొండా రాజమౌళి, కుంట వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

మెట్‌పల్లి రూరల్: జగ్గాసాగర్ గ్రామంలో బుధవారం కరీంనగర్‌కు చెందిన ప్రతిమ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.

వృద్ధుల సంక్షేమానికి కృషి

జగిత్యాల: వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆర్డీవో మధుసూదన్ అన్నారు. జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వారిని సన్మానించారు. సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. వయోవృద్ధుల కోసం అన్ని మున్సిపల్, డివిజన్, మండల కేంద్రాల్లో డేకేర్ సెంటర్ల ఏర్పాటుకు ముఖ్యమంత్రి ఆదేశాలివ్వడం ఎంతో అభినందనీయమన్నారు. హన్మంతరావు, ప్రకాశ్‌రావు, విజయ్, యాకూబ్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

కథలాపూర్: కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం వైద్యశాఖ జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ అర్చన తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో అన్ని విభాగాలను పరిశీలించారు. వైద్యసేవలందిస్తున్న తీరును సిబ్బందినడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారి సింధూజ, వైద్య సిబ్బంది చిన్నరాజం, శ్రీకాంత్, శ్రీలత, విజయ్ తదితరులున్నారు.

బీరులో చెత్త

జగిత్యాలక్రైం: పట్టణానికి చెందిన తారక్ అనే యువకుడు కొనుగోలు చేసిన బీరులో చెత్త రావడంతో ఆందోళనకు గురయ్యాడు. జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులోని వైన్స్‌లో మంగళవారం రాత్రి బీర్ సీసా కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లి చూడగా.. సీసాలో చెత్త, పాకురు ఉండటంతో బుధవారం వైన్స్ యజమానిని నిలదీశాడు. దీంతో వైన్స్ యజమాని బీరును తీసుకొని మరో బాటిల్ ఇచ్చాడు. బీరు బాటిల్‌లో చెత్త వస్తే తమకు సంబంధం లేదని, తాము కూడా కంపెనీకి రిటర్న్ చేస్తామని వైన్స్ నిర్వాహకుడు తెలిపారు.

రెడ్డి సంఘం ఎన్నికల్లో మహిళా పదవులు ఏకగ్రీవం

జగిత్యాలజోన్: రెడ్డి సంఘం జిల్లా కమిటీ ఎన్నికల్లో మహిళలకు కేటాయించిన పదవులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో వారి ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి నర్సింహారెడ్డి తెలిపారు. ఉపాధ్యక్షురాలిగా నాగిరెడ్డి రజిత, సంయుక్త కార్యదర్శిగా అయిల్నేని ప్రియాంక, కార్యవర్గ సభ్యులుగా బద్దం వెంకటరమణదేవి, మేడిపల్లి పుష్ప ఎన్నికయ్యారు.

ఉపాధ్యాయుడికి పూర్వ విద్యార్థుల చేయూత



రాయికల్: మూటపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యావలంటీర్‌గా పని చేసిన మారంపల్లి నర్సయ్య పరిస్థితిని చూసి చలించిన 2000–01 సంవత్సరంలో 7వతరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా కలిసి బుధవారం రూ.20వేల నిత్యావసర వస్తువులు అందజేశారు. బండి దిలీప్, సురేశ్, రాజేందర్, బట్టు భూమేశ్, లక్ష్మీనర్సయ్య, భరత్, గ్రామ మాజీ సర్పంచ్ బెక్కం తిరుపతి పాల్గొన్నారు.

తడిసిన ఎరువుల బస్తాల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న మనోజ్‌కుమార్

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని జగిత్యాల సహకార సంఘంలో వరద నీటికి తడిసిన ఎరువులు బస్తాలతోపాటు రేషన్ బియ్యం సంచులను జిల్లా సహకారాధికారి మనోజ్‌కుమార్ బుధవారం సందర్శించారు. చైర్మన్ మహిపాల్‌రెడ్డి, సంఘ సీఈవో వేణు వివరించారు. సంఘం గోదాంలో నిల్వ ఉంచిన వస్తువులు తడవడంతో దాదాపు రూ1.80లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు చైర్మన్ తెలిపారు. లచ్చయ్య, శివనాగేందర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ



సారంగాపూర్ రైతు వేదికలో దరఖాస్తు స్వీకరిస్తున్న ఏఈవో

సారంగాపూర్: అర్హత ఉండి రుణమాఫీ కాని రైతుల నుంచి వ్యవసాయ శాఖ రెండో రోజు బుధవారం కూడా దరఖాస్తులు స్వీకరించింది. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల లోపు మూడు విడతల్లో రుణమాఫీ చేయగా, సారంగాపూర్, బీర్‌పూర్ మండ లాల్లో పలు కారణాలతో రూ.2లక్షల లోపు వివిధ కారణాలతో రుణమాఫీ కాని వారి నుంచి వ్యవసాయ శాఖ దరఖాస్తులను స్వీకరించే కార్యక్రమాన్ని చేపట్టింది. సారంగాపూర్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి 215 దరఖాస్తులు రాగా, బీర్‌పూర్ మండలంలో 150 మంది రైతులు దరఖాస్తులు అందజేశారు. ఉమ్మడి మండల వ్యవసాయాధికారి తిరుపతినాయక్, ఏఈవో వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



సారంగాపూర్: లక్ష్మీదేవిపల్లి శివారు గ్రామం నాయికపుగూడెం గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని నాయికపుగూడెం గిరిజనులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వారం రోజుల క్రితం బీర్‌పూర్ మండలంలో మరో రెండు శివారు గ్రామాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేశారని, నాయికపుగూడెం లక్ష్మీదేవిపల్లి గ్రామానికి 2.50 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. నాయికపుగూడెంలో 500 వరకు జనాభా ఉంది. పూర్తిగా అటవీ ప్రాంతానికి ఆనుకొని ఉంది. వీటిని పరిగణనలోకి తీసుకొని నూతన పంచాయతీగా ఏర్పాటు చేయాలని నాయికపుగూడెంవాసులు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారి ఎంపీడీవో లచ్చాలు ఫోన్ నంబర్ 7842567193

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9705346639

బాలిక కిడ్నాప్

కోరుట్ల: కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన బాలిక(16)ను బుధవారం వేకువజామున అదే గ్రామానికి చెందిన పల్లపు మహేందర్, ఆయన మేనమామ ఇడగొట్టు మూర్తి, మరికొందరు కలిసి కిడ్నాప్ చేసినట్లు బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్వేత తెలిపారు. ఇదే బాలికను జూలై 15న మహేందర్, మరికొందరు కలిసి కిడ్నాప్ చేశారు. ఆ సమయంలో మహేందర్‌పై కిడ్నాప్ కేసు నమోదైంది. కొన్నిరోజులకు బాలికను వదిలేయగా ఇంటికి చేరింది. అప్పటినుంచి మహేందర్ పరారీలో ఉన్నట్లు సమాచారం. తాజాగా బాలిక మళ్లీ కిడ్నాప్ కావడంతో పరారీలో ఉన్న మహేందర్, అతని మేనమామ మూర్తి కలిసి బాలికను ఎత్తుకెళ్లారని తల్లి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

లోకల్ వాయిస్

పరిమితికి మించి ప్రయాణం సరికాదు



రాయికల్: ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రవేశ పెట్టడం మంచిదే కానీ.. బస్సుల్లో నిర్ణీత సీట్ల కంటే ఎక్కువ మందిని ఎక్కించుకోవద్దు. ఇటీవల మోరపల్లిలో రెండు బస్సు చక్రాలు ఊడిపోయిన ఘటన తెలిసిందే. గతంలో కొండగట్టు వద్ద ప్రమాదం జరిగిన సంఘటన మరిచిపోలేనిది. మరోసారి ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా నిర్ణీత సీట్లలోనే మహిళలకు అవకాశమివ్వాలి.

– వాసం అనురాధ, రాయికల్

రుణమాఫీ చేయించాలని వినతి

కోరుట్ల: సాంకేతిక లోపాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వివరిస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కెనరా, యూనియన్ బ్యాంకుల్లో రుణాలు పొందిన రైతులకు సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాలేదని కాంగ్రెస్ నాయకులు విప్‌కు బుధవారం వివరించారు. పట్టణంలోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవాల్లో పాల్గొనేందుకు కోరుట్లకు వచ్చిన విప్‌కు రుణమాఫీ జరిగేలా చర్యలు చేపట్టాలని వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు, బ్లాక్ అధ్యక్షులు అల్లూరి మహేందర్, సత్యనారాయణగౌడ్, మెట్‌పల్లి, కోరుట్ల అధ్యక్షులు జెట్టి లింగం, తిరుమల గంగాధర్‌గౌడ్, కొంతం రాజం తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలు నిర్వహించాలి

సారంగాపూర్: పెంబట్ల గ్రామంలో మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించాలని జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత జిల్లా వైద్యాధికారికి విజ్ఞప్తి చేశారు. పెంబట్ల గ్రామంలో రెండు రోజుల క్రితం మరణించిన సీనియర్ ఎల్ఐసీ ఏజెంటు పొంపర్తి గంగన్న కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. గ్రామస్తులు జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉందని చెప్పారు. గ్రామంలో ఇప్పటికే పలు డెంగీ కేసులు నమోదయ్యాయని, వైద్యశిబిరాలు నిర్వహించాలని సూచించారు. స్పందించిన వైద్యశాఖ వైద్యశిబిరం నిర్వహించింది. మాజీ సర్పంచ్ లింగన్న, నాయకులు సురేశ్, రాజు తదితరులున్నారు.

కులం పేరుతో దూషించిన ఇద్దరిపై కేసు

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని ధరూర్ హౌసింగ్ బోర్డు ప్రాంతానికి చెందిన కొత్తూరి స్వామిని కులం పేరుతో దూషించిన సజ్జనారపు రాము, అతని భార్య భారతిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై తిరుపతి తెలిపారు. స్వామి కొద్దికాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ధర్మపురి రోడ్‌లో భూమి విక్రయానికి ఉన్నట్లు బోర్డు పెట్టగా.. సెల్‌నంబరు ఆధారంగా రాజమౌళిని స్వామి సంప్రదించాడు. తన అన్నయ్య సత్యనారాయణ హైదరాబాద్‌లో ఉంటాడని, అతడి వద్ద ధర నిర్ణయమవుతుందని చెప్పగా.. ఇద్దరు స్నేహితులతో వెళ్లి సత్యనారాయణతో రూ.50లక్షలకు ఒప్పందం చేసుకున్నారు. జగిత్యాలకు వచ్చాక సత్యనారాయణ తమ్ముడు రాము, అతడి భార్య భారతి భూ విక్రయ ఒప్పంద పత్రంపై సంతకం పెట్టబోమని, చిల్లర కులస్తులకు భూమి అమ్మబోమని కులం పేరుతో దూషించారు. స్వామి ఫిర్యాదు మేరకు రాము, అతని భార్యపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై..

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. గ్రామానికి చెందిన బొజ్జ చిన్నయ్య అనే వ్యక్తి గ్రామంలో సీసీ రహదారులు, డ్రైనేజీలు కట్టడం లేదంటూ కార్యదర్శిని చంపుతానని బెదిరించాడు. ఉద్దేశపూర్వకంగానే తనను బెదిరించాడని కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



మాట్లాడుతున్న సీఐ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడొద్దని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి సూచించారు. బుధవారం వర్షకొండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాలు, అనర్థాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ అనిల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేందర్, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పొనకంటి వెంకట్, మాజీ ఉప సర్పంచ్ లక్ష్మణ్, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు ప్రకాశ్, కిషోర్, నాయకులు తుక్కారాం, ఉపాధ్యాయులు గాదే శ్రీనివాస్‌రావు, శివకృష్ణ, ఇమ్మానుయేల్, మమత తదితరులు పాల్గొన్నారు.